క్లుప్తంగా

లోపూడి సచివాలయానికి అద్దె చెల్లింపునకు చర్యలు



లోపూడి సచివాలయంలో సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చెయ్యపేట : మండలంలో గల లోపూడి సచివాలయం అద్దె చెల్లింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. అద్దె చెల్లించకపోవడంతో మంగళవారం సచివాలయానికి తాళాలు వేసిన అంశంపై సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. బకాయి పడ్డ అద్దెను యజమానికి చెల్లించడానికి ఎంపీడీవో విజయలక్ష్మి, మండల పంచాయతీ అధికారి విజయలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ రామిరెడ్డి చర్యలు చేపట్టారు. గతంలో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి నుంచి కొత్తగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డికి రికార్డులు అప్పగించేలా చేపట్టారు. భవనం యజమానికి చెల్లించాల్సిన అద్దె కోసం బిల్లులు పెట్టామని పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి తెలిపారు.

విద్యార్థులకు బాల ఆరోగ్య కార్డులు

మాకవరపాలెం : రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో విద్యార్థులకు ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బూరుగుపాలెం పీహెచ్‌సీ సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.విద్యార్థుల ఆరోగ్య స్థితి, ఎత్తు, బరువు, ఐరన్ మాత్రల పంపిణీ తేదీలతో పాటు తదితర వివరాలతో కూడిన కార్డులను పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికీ ఆరోగ్య ప్రగతి కార్డును అందజేస్తున్నట్టు పాఠశాల హెచ్ఎం రాము తెలిపారు. అన్ని పాఠశాలలలోన్నూ రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై తనిఖీలు



ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైన్స్, రెవెన్యూ అధికారులు

మాకవరపాలెం: ఇసుక తవ్వకాల ప్రాంతాన్ని గనులశాఖ అధికారులు పరిశీలించారు. మండలంలోని జంగాలపల్లి, బి.ఎస్.పేట గ్రామాల సమీపంలోని సర్పానది వద్ద జరుగుతున్న ఇసుక తవ్వకాలతో తమ జిరాయితీ భూములకు ముప్పు ఉందని రైతులు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ జి.సత్యమూర్తి, స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ జరుగుతున్న తవ్వకాలపై వివరాలు నమోదు చేసుకున్నారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

సాగే ఆధారం... అయినా ఆదాయం ఘనం



చోద్యంలో బీర పాదులు

దాదాపు 1500 ఎకరాల్లో కాయగూరల పెంపకం • గిట్టుబాటు ధరలతో రైతుల ఆసక్తి • వ్యవసాయ యంత్రాలతో ఖర్చు ఆదా

గొలుగొండ : కూరగాయల సాగుతో రైతులు లాభాలు సాధిస్తున్నారు. ఈ సీజన్‌లో రైతులు అధికంగా ఈ పంటలు వేయడం జరుగుతుంది. ధరలు బాగుండడంతో రైతులకు అన్ని రకాల సాగు చేయడం జరుగుతుంది. జిల్లాలోనే గొలుగొండ మండలంలో టమాటా సాగు అధికంగా జరుగుతుంది. కూరగాయల సాగు చేయాలంటే సాగునీరు ఉండాలి. గొలుగొండ మండలంలో 600కు పైగా వ్యవసాయ మోటార్లు ఉండడం వల్ల ఈ సాగుకు అనుకూలంగా ఉంది.

600 వరకు విద్యుత్ కనెక్షన్లు

మండలంలో ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 600 వరకు ఉన్నాయి. మండలంలో చోద్యం,లింగంపేట, అమ్మపేట, ఏటిగైరంపేట తదితర ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్లు అధికంగా ఉన్నాయి. సాగునీరు పుష్కలంగా ఉండడంతో ఆరుతడిగా పంటలు వేసి నర్సీపట్నం మార్కెట్ ద్వారా అమ్మకాలు చేస్తారు. టమాటా 400 ఎకరాల్లో, బీర 250 ఎకరాల్లో, వంగ 500 ఎకరాల్లో, పచ్చిమిర్చి 200 ఎకరాల్లో, బెండ 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

టమాటాకు పెట్టింది పేరు

జిల్లా వ్యాప్తంగా టమాటా సాగు గొలుగొండలో అధికంగా జరుగుతుంది. ఈ సాగుకు అనుకూలమైన నల్ల నేలలు ఉండడం వల్ల సాగు చేస్తుంటారు. తాండవ జలాశయం ఆనుకొని మండలంలో అమ్మపేట, గొలుగొండ, సాలికమల్లవరం, విప్పలపాలెం, చిన్నయ్యపాలెం గ్రామాలు ఉన్నాయి.

ధరలు బాగున్నాయి..

ప్రస్తుతం వస్తున్న పంట స్థానిక మార్కెట్ ద్వారా అమ్మకాలు చేస్తున్నారు. అధికంగా పంట వచ్చినప్పుడు జిల్లా కేంద్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. వ్యవసాయ మోటార్ల ద్వారా రైతుల భూములు ఖాళీ ఉండకుండా కూరగాయల సాగు చేయడం జరుగుతుంది. మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని కూరగాయల ధరలు అధిక రేట్లు వల్ల రైతులకు లాభాలు వస్తున్నాయి. రైతుల నుంచి వ్యాపారులు కిలో టమాటా రూ.40. బెండ రూ. 45, బీర రూ. 50, వంగ కిలో రూ.25 రేట్లతో కొనుగోలు చేసి మార్కెట్‌లో మంచి ధరలకు అమ్మకాలు చేస్తు న్నారు. ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు.

యంత్రాలతో సాగు

రైతులు ఖర్చులు తగ్గించి వ్యవసాయం చేయడం జరుగుతుంది. కూలీలతో పెట్టుబడి ఖర్చు పెరగడంతో రైతులు చిన్న చిన్న వ్యవసాయ యంత్రాలు ఉపయోగించి సాగు చేపడుతున్నారు. దీని వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుందని రైతులు చెబుతున్నారు.

సీజన్‌ను బట్టి సాగు



ప్రతి ఏటా మూడు ఎకరాల్లో కూరగాయల సాగు చేయడం జరుగుతుంది. కొత్త రకం విత్తనాలు పరిచయం చేసి వాటి ద్వారా అధిక దిగుబడులు రాబట్టడం జరుగుతుంది. అలాగే కూలీల ఇబ్బందుల దృష్ట్యా వ్యవసాయ యంత్రాలు వాడడం చేస్తున్నాం. దీని వల్ల పెట్టుబడి తగ్గుతుంది. వ్యవసాయ మోటారు ఉండడం వల్లనే ఈ అవకాశం ఉంది.
– పి.కవి, లింగంపేట రైతు

నిలకడగా ఆదాయం



ప్రతి ఏటా కూరగాయల సాగుతో పాటు పాలకూర, కొత్తిమీర, చుక్క కూర తదితర ఆకుకూరలు సాగు చేస్తాం. దీంతో పెట్టుబడులు పోను ఆదాయం బాగానే ఉంది. ఈ ఏడాది అన్ని కూరగాయ ధరలు నిలకడగానే ఉన్నాయి. ఆకు కూరల వల్ల తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం వస్తుంది
– కర్రెడ్ల బాబూరావు, రైతు, గొలుగొండ

గోవాడ సుగర్స్‌కు చెరకు సరఫరా చేయండి



పల్లె పల్లెకు చెరకు కార్యక్రమంలో పాల్గొన్న సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు

చీడికాడ : త్వరలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులు, సుగర్ ఫ్యాక్టరీకి చెరకును సరఫరా చేసి, ఫ్యాక్టరీ మనుగడ కాపాడాలని చోడవరం చెరకు అభివృద్ధి మండలి చైర్మన్(సీడీసీ) సుంకర శ్రీనివాసరావు అన్నారు. పల్లె పల్లెకు చెరకు కార్యక్రమంలో భాగంగా శిరిజాం, ఖండివరం, గ్రామాల్లో సుగర్ ఫ్యాక్టరీ ఫీల్డ్ సిబ్బందితో కలిసి చెరకు రైతులను కలిసారు. ప్రతి 15 రోజులకో పర్యాయం చెరకు పేమెంట్లు అందేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి విషయంలో పట్టించుకోలేదని, ఫ్యాక్టరీ మహాజన సభ జరిగి నెల రోజులు పూర్తయిన అఖిలపక్ష కమిటీ ఏర్పాటు చేయలేదని అన్నారు. గత ప్రభుత్వం ఈ సుగర్ ఫ్యాక్టరీకి రూ.90 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ సిబ్బంది శ్రీనివాసరావు, సురేష్, సూరిబాబు, శంకర్రావు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసుకోండి

జీపీడీపీ శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ జగన్‌మోహన్



కె.కోటపాడులో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు : ప్రభుత్వ సహకారంతో గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు ముందస్తుగా గ్రామస్థాయిలో అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. కె.కోటపాడు వెలుగు కార్యాలయంలో బుధవారం ఎంపీటీసీ, సర్పంచ్‌లకు జీపీడీపీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసే 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలని తెలిపారు. విద్య, తాగునీరు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు, వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి పాల్గొన్నారు.

అనువైన సమయంలోనే వరికోతలు చేపట్టాలి

కె.కోటపాడు : వాతావరణం అనుకూలంగా ఉన్నప్పుడే వరికోతలను రైతులు నిర్వహించాలని కె.జె.పురం వ్యవసాయశాఖ సహాయకుడు అల్లం అప్పలనాయుడు అన్నారు. కె.జె.పురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కోతలకు చేరుకున్న వరి పంటలకు మండల వ్యవసాయాదికారి సోమశేఖర్‌తో కలిసి అప్పలనాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ వర్షాలు పడే పరిస్థితులుంటే కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. కోతలయ్యాక వరి పంట తడిస్తే పంటను ఆరబెట్టి ఉప్పుద్రావణాన్ని పంటపై పిచికారి చేయాలని సూచించా. తద్వారా పంటను కాపాడుకోవచ్చన్నారు.

జి.కోడూరు విలేజ్ హెల్త్ క్లినిక్ తనిఖీ

మాకవరపాలెం: జి.కోడూరు విలేజ్ హెల్త్ క్లినిక్ ను జిల్లా టాస్క్ ఫోర్స్ టీం బుధవారం తనిఖీ చేసింది. క్లినిక్ పరిధిలో వైద్య సిబ్బంది అంది స్తున్న సేవలు, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలను టీం సభ్యులు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారికి క్లినిక్‌లో అందుతున్న సేవలు, 19 ఏళ్లలోపు బాలికలకు చేపడుతున్న రక్త పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీం సభ్యులు డాక్టర్ లూసీ, జగదీష్, రామచంద్రరావు, జనార్దన్, మాకవరపాలెం వైద్యాధికారి సీతారామలక్ష్మి పాల్గొన్నారు.

ప్రణాళికతో పంచాయతీ నిధులు వ్యయం

రోలుగుంట : పంచాయతీ నిధుల వినియోగంపై ముందుగా ప్రజాప్రతినిధులు, అధికారులు అవగాహన పెంచుకోవాలని ఈవోపీఆర్‌డీ చిరంజీవి సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మధ్యాహ్నం 15వ ఆర్థిక సంఘం నిధులతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, నిధుల కేటాయింపుపై ఈవోపీఆర్డీ శిక్షణ ఇచ్చారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు, తాగునీరు, మురుగు కాల్వలు, రహదారుల నిర్మాణానికి నిధులు ఎలా కేటాయించాలో వివరించారు.

మాకవరపాలెం : గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. పంచాయతీలకు వచ్చే జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపట్టే వివిధ రకాల అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించడంపై ఎంపీడీవో సీతామహాలక్ష్మి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మంగ పాల్గొన్నారు.

మాడుగుల : గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక కీలకమని స్థానిక ఎంపీడీవో కొంకి అప్పారావు అన్నారు. గ్ర 2024–25కు సంబంధించి ఉపాధి హామీ పథకం, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, గ్రామీణాభివృద్ధి, ఇతర శాఖలకు సంబంధించి పనులు సమీక్షించారు.

దేవరాపల్లి: మండలంలోని అన్ని పంచాయతీల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో సువర్ణరాజు అధ్యక్షతన గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

స్థానిక ప్రతినిధులపై వివక్ష తగదు

నాతవరం : కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుంచి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ప్రోటోకాల్ నిబంధనలను పాటించడం లేదని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులకు ప్రభుత్వ నిధులు వినియోగించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ప్రజలతో ఎన్నికోబడిన ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల ప్రమేయం లేకుండా కూటమి నేతలతో శంకుస్థాపనలు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

సారా విక్రేత అరెస్టు

చోడవరం రూరల్ : నాటుసారాను విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద ఐదు లీటర్ల సారాను చోడవరం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కె.వి.పాపునాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఐలు ఎం.శేఖరం, కె.హనుమంతు తమ సిబ్బందితో చోడవరం పట్టణ పరిధిలో విస్తృత దాడులు నిర్వహించారు. ఐటీఐ కాలనీలో చేపట్టిన తనిఖీలో సారా అమ్ముతూ తుపాకుల అప్పలరాజు పట్టుబడగా అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

ములకాపల్లిలో ఆలయ వార్షికోత్సవం

దేవరాపల్లి : ములకలాపల్లిలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. తెల్లవార జాము నుంచి భక్తులు స్వామిని దర్శించుకొని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో లోక శాంతిని ఆకాంక్షిస్తూ హోమాన్ని జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ అన్నసమారాధనకు చుట్ట ప్రక్కల నుంచి భక్తజనం తరలి వచ్చి మహా ప్రసాదాన్ని స్వీకరించారు.

ఎయిడ్స్ నియంత్రించాలి

మాకవరపాలెం : అవగాహనతో హెచ్ఐవీని నివారించవచ్చని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్‌వర్కర్ స్కీం జోనల్ సూపర్ డి.రమణ అన్నారు. మండలంలోని లచ్చన్నపాలెంలో బుధవారం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపకుండా వారిని ఆదరించాలన్నారు.

అర్జీలన్నీ సకాలంలో పరిష్కరిస్తాం

రోలుగుంట: బుచ్చింపేట గ్రామంలో బుధవా రం గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్య లు, వాటి పరిష్కార మార్గాలపై తహసీల్దార్ నాగమ్మ రైతులకు వివరించారు. భూసర్వేలో లోపాలున్న రైతుల నుంచి వినతులను స్వీకరించారు. వాటిని నమోదు చేసుకొని దరఖాస్తుల న్నీ పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

ఆకాశ దీపార్చన

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి రోజు రాత్రి తొలి జాములో ఆకాశ దీపార్చన నిర్వహిస్తున్నారు. ఆలయంలో మహాకాళేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం నెల రోజుల పాటు ఆకాశ దీపార్చన, ధ్వజస్తంభం మీద దీపాలు వెలిగిస్తున్నారు.

బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

దేవరాపల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విపరీతంగా పెరిగిన నిత్యవసర ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర డిమాండ్ చేశారు. చింతలపూడిలో స్థానిక ప్రజలతో కలిసి పెరిగిన నిత్యవసర ధరలను నిరసిస్తూ బుధవారం ఆందోళన చేపట్టారు. ఒక వైపు విద్యుత్ చార్జీలు, మరో వైపు నిత్యవసర ధరలు పెంచడంతో సామాన్య ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో విపరీతంగా పెరిగిన ధరలను నిరసిస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్నామని, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మూల గుమ్మి ఎర్రునాయుడు, సోంబాబు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో సాగుకు మేలు

దేవరాపల్లి : వ్యవసాయ యాంత్రీకరణపై అన్నదాతలు దృష్టి సారించాలని అనకాపల్లి, విశాఖపట్నంకు చెందిన వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్.సుబ్రహ్మణ్యం, పి.శ్రీధర్ అన్నారు. కొత్తపెంటలో సర్పంచ్ రొంగలి వెంకటరావు, ములకలాపల్లి సర్పంచ్ గొర్లి అన్నపూర్ణ అధ్యక్షతన బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడారు. వ్యవసాయ యాంత్రీకణతో తక్కువ ఖర్చుతో సాగు, కోత పనులు చేసుకోవచ్చునని రైతులకు వివరించారు.

ఆయుష్ మిషన్‌పై శిక్షణ

రోలుగుంట : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బుధవారం ఆశాలకు వైద్యాధికారి కె.ధనలక్ష్మి జాతీయ ఆయూష్ మిషన్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యురాలు శ్రీదేవి సాధారణ వ్యాధుల నివారణకు ఆయూష్ వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. డయాబిటిస్ (సుగర్ వ్యాధి)మరి కొన్ని వ్యాధుల చికిత్సకు ఆయుష్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ

దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట పంచాయతీ శివారు సీతంపేటలో కార్తీక ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి నిర్వహించిన అయ్యప్ప స్వామి అంబలం పూజ అంబరాన్నంటింది. స్థానిక శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతులు ఆధ్వర్యంలో జరిగిన అంబలం పూజకు దేవరాపల్లి, కె.కోటపాడు, వేపాడ మండలాల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప మాలాధారణ భక్తులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన మరడాం రవి స్థానిక అయ్యప్ప భక్తులతో కలిసి స్వామికు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

కె.జె.పురంలో నెహ్రూ జయంతి

మాడుగుల రూరల్ : మేజర్ గ్రామ పంచాయతీ అయిన కె.జె.పురంలో దేశనాయకులను నిరంతరం స్మరిస్తారు. స్వాతంత్ర్య సముపార్జనలో కీలక పాత్ర వహించిన గాంధీ, సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, అల్లూరి సీతారామరాజు తదితర నాయకులకు వర్ధంతి, జయంతి కార్యక్రమాలు, జనవరిలో తీర్థాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. దివంగత మాజీ గ్రామ సర్పంచ్ పాలకుర్తి శ్రీరామూర్తి 1975లో వీరి విగ్రహాలను బొంబాయి నుంచి తీసుకొచ్చి ఈ గ్రామంలో ప్రతిష్ఠించారు. భారత మాజీ ప్రధాని నెహ్రూ విగ్రహాన్ని కూడా అప్పట్లోనే ఏర్పాటు చేశారు. ఆ వీధికి నెహ్రూ వీధి అని నామకరణం చేశారు. ఏటా ఫిబ్రవరి 8న ఇక్కడ తీర్థం నిర్వహిస్తారు. అంతేకాకుండా నవంబర్ 14 న నెహ్రూ జయంతి నిర్వహిస్తారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


కె.కోటపాడు : చౌడువాడ శాఖా గ్రంథాలయంలో 37వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. ఈ మేరకు బుధవారం కరపత్రాలను ఎంపీపీ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ నెల 20 తేదీ వరకూ వారోత్సవాలను జరపనున్నట్టు తెలిపారు. 14న నెహ్రూ జయంతి, పుస్తక పఠనం, 15న చిత్రలేఖనం, 16న వ్యాసరచన, 17న వక్తృత్వం, 18న క్విజ్ పోటీలు, 19 ఇందిరాగాంధీ జయంతి, మ్యూజికల్ చైర్ పోటీలు, 20న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు పంపిణీ ఉంటాయన్నారు.

పోస్టల్ ఉద్యోగి అదృశ్యం



దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి పోస్టాఫీస్ బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న దాసరి సత్య ప్రవీణ్(23) అదృశ్యమైనట్టు ఆయన తండ్రి లోవరాజు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. అన్నవరం రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతానికి చెందిన సత్య ప్రవీణ్ మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. ఆ యువకుడు దేవరాపల్లి స్టేట్ బ్యాంక్ వీధిలో అద్దె ఇంటిలో ఉంటున్నాడు. చివరిగా సత్య ప్రవీణ్ మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో దేవరాపల్లిలో జెరాక్స్ కోసం వెళ్తూ సహ ఉద్యోగి, రూమ్ మేట్ కొల్లి దేముడు నాయుడుకు కనిపించాడు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో సెల్ ఫోన్‌ను ఇంట్లో విడిచిపెట్టి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం స్నేహితులు, బంధువులను ఆరా తీసిన ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాము కుటుంబానికి పరామర్శ



రాము కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : మండలంలో గల వడ్డాది గ్రామానికి చెందిన సీనియర్ విలేకరి శిరిగిరిశెట్టి రాము(ఆంధ్రజ్యోతి) కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించారు. రాము అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా మంగళవారం ధర్మశ్రీ అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత 30 ఏళ్లగా రాము విలేకరిగా విధులు నిర్వహిస్తూ మండల అభివృద్ధికి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేశారన్నారు. రాము భార్య వెంకటలక్ష్మి, కుమారుడు గణేష్, లలిత ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాము కుటుంబానికి అండగా ఉంటామన్నారు. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి నాయకులు శ్రీరామూర్తి పాల్గొన్నారు.

గిరిజన శిఖరాగ్ర గ్రామాల్లో తహసీల్దార్ సందర్శన



పీత్రుగెడ్డలో గర్భిణి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుంటున్న తహసీల్దార్ నాగమ్మ, డీటీ శంకర్రావు

రోలుగుంట : శిఖరాగ్ర గ్రామాల గిరిజనులకు వైద్య సేవలందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు తహసీల్దార్ ఎస్.నాగమ్మ తెలిపారు. మండలంలోని లోసింగి, పెదగరువు తదితర గిరిజన గ్రామాలను ఆమె డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావుతో కలసి బుధవారం సందర్శించారు. అక్కడ ప్రజల జీవన పరిస్థితులు, విద్య. వైద్యం గురించి ఆరా తీశారు. సమీపంలో పీత్రుగెడ్డ గ్రామానికి చెందిన గర్భిణి కొర్రా సంధ్య కొండ దిగువనున్న బుచ్చింపేట ఆస్పత్రిలో ప్రసవ సమయానికి ముందుగా వచ్చి చేరడానికి అభ్యంతరం తెలుపుతుందన్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆమె ఇంటికి వెళ్లి నచ్చచెప్పారు. ఆమె భర్త కొండబాబు, కుటుంబీకులతో మాట్లాడి ఈ నెల 20న ఆస్పత్రిలో చేర్పించడానికి ఒప్పించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించండి

మాడుగుల రూరల్ : బాల కార్మిక వ్యవస్థ సమూల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సహకరించాలని చోడవరం సహాయ కార్మికశాఖ అధికారి వి.సూర్యనారాయణ కోరారు. పాన్ ఇండియా బాల కార్మికుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ, ఐసీడీఎస్, పోలీస్, సీడ్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా బుధవారం మాడుగుల, ఘాట్‌రోడ్‌లో వివిధ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఘాట్‌రోడ్‌లోని ఆర్ఆర్ ఫ్యాషన్, ఎం.ఎస్.షాపింగ్ మాల్, ఎస్.వి.ఫ్యాషన్స్‌లో పనిచేస్తున్న బాలికకు తక్కువ జీతం చెల్లిస్తున్నట్టు గుర్తించామని, వ్యత్యాస జీతం కింద క్లెయిమ్‌లను పై అధికారి వద్ద దాఖలు చేస్తామని సహాయ కార్మికశాఖ అధికారి వి.సూర్యనారాయణ తెలిపారు.

ఉత్సాహంగా బాలల నృత్య పోటీలు



జూనియర్స్ విభాగంలో విద్యార్థుల నృత్యాలు

నర్సీపట్నం : బాలల దినోత్సవం పురస్కరించుకుని పీఆర్‌టీయు నిర్వహిస్తున్న బాలల ప్రతిభాపాటవ పోటీల్లో భాగంగా బుధవారం విచిత్ర వేషధారణ, జానపద నృత్య పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు విచిత్ర వేషధారణ పోటీల్లో పాల్గొన్నారు. రైతు, జలకన్య, దుర్గాదేవి, భరతమాత, వ్యామగామి, అల్లూరి సీతారామరాజు, దుర్యోధనుడు, ఝాన్సీ లక్ష్మీబాయి, శకుంతల వేషధారణల్లో విద్యార్థులు అలరించారు. జానపద నృత్య పోటీల్లో 50 బృందాలు పాల్గొన్నాయి. దేశభక్తి, సినీ పాటలకు విద్యార్థులు నృత్యాలతో అలరించారు. పోటీల్లో విజేతలకు ఈనెల 14న జరిగే బాలల దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేస్తామని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ తెలిపారు.

డ్వాక్రా డబ్బుల గోల్‌మాల్ పై పోలీసులకు ఫిర్యాదు



పోలీసుస్టేషన్ వద్ద డ్వాక్రా మహిళలు

చోడవరం : డ్వాక్రా గ్రూపు డబ్బులు గోల్‌మాల్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు డ్వాక్రా గ్రూపు సభ్యులు చోడవరం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. సింహాద్రిపురం పంచాయతీ పరిధిలో సబ్బవరపువారి కల్లాలు, సింహాద్రిపురం గ్రామంలో పలు డ్వాక్రా గ్రూపులకు సంబంధించి బ్యాంక్‌కు కట్టాల్సిన డబ్బులు కట్టకుండా డబ్బులు కాజేయడంతో పాటు శ్రీరామ్ గ్రూపునకు మంజూరైన రుణం డబ్బులు సదరు గ్రూపు సభ్యులకు ఇవ్వకుండా వెలుగు సిబ్బంది, బ్యాంక్ అధికారులతో కలిసి రూ.20 లక్షలకు పైబడి మోసానికి పాల్పడ్డారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు కోరారు.

నీటి సంఘం ఎన్నికల నిర్వహణపై శిక్షణ

రోలుగుంట : ఈ నెల 23న జరగనున్న సాగునీటి సంఘం ఎన్నికలపై బుధవారం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. నామినేషన్లు స్వీకరణ, పరిశీలన, లోపాలుంటే తిరస్కరణ వంటి అంశాలపై ఎన్నికల విధుల్లో పాల్గొనున్న సిబ్బందికి ఆ శాఖ జేఈ సంతోష్ శిక్షణ ఇచ్చారు.